క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి రమణ, మంత్రి మంజుల తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలో గరుడాద్రి కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మంత్రి ముంజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో భూదే రాజు, పెంటకోట రాజు, రామలక్ష్మి, సావిత్రి, సత్యవతి పాల్గొన్నారు.

అదుపులో గంజాయి తరలిస్తున్న విద్యార్థి

అగనంపూడి: త్వరలో తన స్నేహితుడు పుట్టిన రోజు..పార్టీ చేసుకోవాలని స్నేహితులంతా భావించారు. ఆ పార్టీ మంచి కిక్కు ఉండాలనుకున్నారు. గంజాయితో పార్టీ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గంజాయి తీసుకొస్తూ ఓ యువకుడు పోలీసులకు చిక్కాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన ఓ విద్యార్థి గాజువాకలో నివాసముంటూ డిగ్రీ చదువుతున్నాడు. చోడవరం నుంచి 311 సిటీ బస్సులో పాలిథిన్ కవర్లో కొద్దిపాటి గంజాయిని రవాణా చేస్తున్నాడు. చోడవరం నుంచి వస్తున్న బస్‌ను పోలీసులు తనిఖీ చేయగా రామతేజ బ్యాగ్‌లో గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

గొన్నా కళాశాలలో నాక్ బృందం



గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో నాక్ బృంద ప్రతినిధులు

అగనంపూడి: నాక్ పీర్ కమిటీ శనివారం 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో పర్యటించింది. ఈ పర్యటనలో నాక్ గుర్తింపునకు కావల్సిన అంశాలను పరిశీలించింది. విద్యా బోధన, వసతులు, విద్యార్థుల ప్రగతి, సహపాఠ్యాంశాలు, ఇతర అంశాలను పరిశీలించింది. ఈ పర్యటనలో కమిటీ చైర్‌పర్సన్ తపన్ గొగాయ్, కో ఆర్డినేటర్ హెచ్.సీ.పురోహిత్, సభ్యుడు రవీంద్ర పాల్గొన్నారు.

జవాన్ మృతికి నివాళి



ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణిలో మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా: ఆర్మ్‌డ్ వర్క్‌షాపునకు చెందిన సీఏఫ్‌ఎన్ ర్యాంకర్ గొట్టపు శంకరరావు అంత్యక్రియలను శనివారం విజయనగరం జిల్లా బాడంగిలో అతని స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణిలో శంకరరావు మృతదేహానికి తూర్పు నావికాదళం స్టేషన్ హెడ్‌క్వార్టర్స్ జిల్లా అధికారులు, నగర పోలీసులు నివాళులర్పించారు.

టీకా..ఆరోగ్యం ఎంచక్కా

ప్రతి బుధ, శనివారాల్లో ఉచితంగా అందజేత



నెల్లిముక్కు ఆరోగ్య కేంద్రం వద్ద టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది



సిద్దేశ్వరం ఆరోగ్య కేంద్రం వద్ద టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: జీవితాంతం వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్య రక్షణ కావాలంటే టీకాలు వేయించుకోవాలి. ఇవి ఆరోగ్యానికి రక్షణ కవచంలా ఉంటాయి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన శిశువుల వరకూ వేయించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుంది. నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా వేసే టీకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వేస్తున్నారు.

వ్యాక్సిన్లు వేసేది ఇలా..

గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు తరువాత టీటీ ఇంజక్షన్, అనంతరం ఇంకో నెల వ్యవధిలో మరొకటి వేయించుకోవాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం ట్యాబెట్లు ఇస్తారు. అప్పుడే పుట్టిన బిడ్డకు 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హైపటైటిస్-బి డోస్ వేయించాలని వైద్యులు చెబుతున్నారు. వీటి వలన పోలియో, పచ్చ కామెర్లు వ్యాధుల నుంచి రక్షణ లభిస్తోందంటున్నారు. 14 రోజుల వ్యవధిలో క్షయ వ్యాధి రాకుండా బీజీజీ టీకా వేయించాలని, 6 నుంచి 14 వారాల్లో వ్యవధిలో పోలియో చుక్కలు వేస్తారని, 5, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలంటున్నారు. ఇవి వేయించడంతో కోరింత దగ్గు, ధనుర్వాతం, మెదడు వాపు, పచ్చ కామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. 9 నెలల నుంచి 5 ఏళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్-ఏ చుక్కలు తొమ్మిది డోసులు వేయించడం మరువకూడదన్నారు. పెదగంట్యాడ మండల పరిధిలో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు.



నడుపూరు సామాజిక భవనం వద్ద టీకాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

టీకాలతో రక్షణ



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వలన ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడవచ్చు. టీకాల ఆవశ్యకతపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలి. గర్భిణులు, చిన్నారులు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలి. ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రజలకు నిరంతరం తగిన అవగాహన కల్పిస్తున్నారు.

–డాక్టర్ జి.మానస– యూపీహెచ్‌సీ సిద్దేశ్వరం

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి



జలుమూరి ఆనందరావు మృతదేహం

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్, బీసీ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, సరియాపల్లికి చెందిన జలుమూరు ఆనందరావు (65) దయాల్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఆయన కూలి పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి వస్తూ..దయాల్‌నగర్ వద్ద బీసీ రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి పెదగంట్యాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న కర్రి మోహన్‌రావు అనే యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఆనందరావు రోడ్డుపై తుళ్లిపడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో వెంటనే అతడ్ని అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 9.30 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ప్రమాద సంఘటనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. మృతుని కుమారుడు జలుమూరి సాయికిరణ్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ఉక్కు విలీన దీక్ష'

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కు విలీన దీక్ష చేయనున్నారు. ఉక్కు రంగాన్ని వ్యూహాత్మక రంగంలో ఉంచడానికి, సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునఃవిలీనానికి, పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి చేయడానికి తక్షణ బెయిలౌట్ ప్యాకేజీకి ఉక్కు అధికారుల సంఘం అభ్యర్థిస్తోంది. సీ భవన్ వద్ద ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు దీక్ష నిర్వహించనున్నారు. ఉద్యోగులందరూ దీక్షలో పాల్గోవాలని నిర్వాహకులు కోరారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ మద్దతు

సీ చేపట్టిన ఉక్కు విలీన దీక్షకు స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ తమ మద్దతు ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు సెయిల్ విలీనంతో ముడిపడి ఉన్నందున వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని అసోసియేషన్ నాయకులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ డిమాండ్ చేశారు.

వైద్య విధానంపై ఆర్ఎంపీ, పీఎంపీలకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ మనోజ్ కుమార్

గాజువాక: కీళ్లు, తుంటి, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, చికిత్స సూచనలపై ఆర్ఎంపీ, పీఎంపీలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ శివాని ఆస్పత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ దుప్పల మనోజ్ కుమార్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీ శివాని ఆస్పత్రి జనరల్ మేనేజర్ బమ్మిడి భానుమూర్తి మాట్లాడుతూ వెన్ను, తుంటి, మోకాలు శస్త్ర చికిత్సలకు అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు వైద్య పరమైన అప్‌డేట్స్ ఇవ్వడంలో తమ ఆస్పత్రి ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



వామన మూర్తి

గోపాలపట్నం: జీవీఎంసీ వార్డు 90వ ఎఫ్ బ్లాక్‌కు చెందిన వామన మూర్తి (69)అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన వామన మూర్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కుమారుడు సాంబశివరావుతో కలిసి నివాసముంటున్నారు. ఎప్పుడు బయటకు వెళ్లినా తిరిగి వచ్చేవాడని ఈ సారి రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా అన్ని ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. గోపాలపట్నం సీఐ సురేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఫొటోలో ఉన్న వ్యక్తి ఎక్కడైనా తారసపడితే సమాచారమివ్వాలని గోపాలపట్నం పోలీసులు కోరారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతుల సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



చెక్కు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరానికి చెందిన బి.శ్రీనివాసరెడ్డి దాత లక్ష 1116, మాధవదార ప్రాంతానికి చెందిన కె.అన్నయ్య అనే దాత లక్ష 16 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై అన్నప్రసాద భవనంలో ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు సంబంధిత చెక్కులు అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాదం, శేష వస్త్రాలను అధికారులు అందజేశారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

- అప్పన్నస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేయజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

రూ.10 భోజనానికి 356 రోజులు



రూ.10 భోజనం పంపిణీ చేస్తున్న వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్ : వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్ సహాయకులకు రూ.10కే రుచికరమైన, శుభ్రమైన భోజనాన్ని స్వామి వివేకానంద సంస్థ ద్వారా ప్రతి రోజూ పంపిణీ చేస్తోంది. ఈ కార్యక్రమం శనివారం నాటికి 356 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సుద్ అహ్మద్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్ల సహాయకులకు భోజనం చాలా అవసరమని, రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుల సహకారంతో రూ.10కే భోజనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామని తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సంస్థకు స్వామి వివేకానంద సంస్థ ఈ సందర్భంగా అభినందనలు తెలిపింది. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు కల్యాణ్ ఆదిత్య, భరత్ కొల్లపూడి, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును ఆశీర్వదిస్తున్న అర్చకుడు

అక్కిరెడ్డిపాలెం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతను కలిగి ఉండాలని, ఈర్ష్యాద్వేషాలను వదిలి ప్రశాంతంగా గడపాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం ఉదయం షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి విచ్చేశారు. వెంకయ్య నాయుడుకు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ స్వాగతం పలికారు. అనంతరం వెంకయ్య నాయుడును ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి వెంకయ్య నాయుడును ఆశీర్వదించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ జీఎం జీవీ కృష్ణయ్య, ఎస్టేట్ మేనేజర్ జి.గంగా మహేష్, దివ్యక్షేత్రం ప్రతినిధులు, పలువురు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

స్టీల్ సీఎండీతో 'సెఫీ' నేతల భేటీ



స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను కలిసిన సెఫీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సెఫీ) నాయకులు శనివారం స్టీల్‌ప్లాంట్ సందర్శించారు. సెఫీ చైర్మన్ నరేంద్ర కుమార్ బంచోర్, ప్రధాన కార్యదర్శి అబాకస్ మల్లిక్, భిలాయ్ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పర్విందర్ సింగ్, సెఫీ కార్యవర్గ సభ్యులు ఉక్కు పర్యటనలో భాగంగా సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు పాండే, జి.వి.ఎస్. ప్రసాద్, గణేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ అద్భుతమైన లేఅవుట్ కలిగి ఉందని, 20 మిలియన్ టన్నులకు విస్తరించడానికి అనుకూలంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సెఫీ, నేషనల్ కన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీఓఏ) స్టీల్‌ప్లాంట్ సమస్యకు సెయిల్‌లో విలీనం చేయడమే పరిష్కారమన్నారు. ఉక్కు అధికారుల సమస్యలపై చర్చించారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ యు. శ్రీధర్, ఉన్నతాధికారులతో ప్లాంట్ ఉత్పత్తి గురించి మాట్లాడారు. అనంతరం ప్లాంట్‌లోని ఉత్పత్తి విభాగాలను సందర్శించి అక్కడ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్, సీహెచ్. వెంకటేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బలరామావతారంలో జగన్నాథస్వామి



బలరామావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథస్వామి



భజన గీతాలు ఆలపిస్తున్న భక్తులు

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా అగనంపూడిలోని ఇంద్రద్యుమ్న హాలు వద్ద వేంచేసియున్న జగన్నాథస్వామి..శనివారం బలరాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథస్వామి రథోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ స్వామి దశావతారాల్లో భక్తులకు కనువిందు చేస్తున్నారు. జగన్నాథస్వామిని బలరాముని అవతారంలో అలంకరింపజేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గురు సంతోష్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగం, కుటుంబం రెండూ ముఖ్యమే



పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించిన వారితో పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి

అల్లిపురం: పోలీస్ సిబ్బందికి ఉద్యోగం ఎంత ముఖ్యమో.. కుటుంబం కూడా అంతే ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కమిషనరేట్ పరిధిలో పదోన్నతులు పొందిన 17 సివిల్, ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు కుటుంబాన్ని కూడా చూసుకోవాలన్నారు. కానిస్టేబుల్‌కు తన ఉద్యోగ జీవితంలో పదోన్నతి రావడం చాలా అరుదన్నారు. ఐపీఎస్‌లకు ప్రతి మూడేళ్లకు ఓసారి పదోన్నతి రావడం సహజమన్నారు. అదే సంతోషాన్ని కానిస్టేబుళ్లలో ఉండాలని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పదోన్నతి చెందిన కానిస్టేబుళ్లను వారి కుటుంబ సభ్యుల మధ్య సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తన జీవితంలో ఇటువంటి కార్యక్రమానికి ఎప్పుడూ హాజరుకాలేదన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన వారికి సీపీ, జేసీపీ కె.ఫకీరప్ప, ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా..

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా పోలీస్ సిబ్బంది, నగర ప్రజలు, మీడియా కలిసికట్టుగా పని చేయాలని సీపీ పిలుపునిచ్చారు. గంజాయి అమ్మేవారిని, సేవించే వారిని నగరం వదిలివెళ్లేలా చేద్దామన్నారు. ఇందు కోసం ఇప్పటికే నగరంలో అవసరమైన చోట సీసీ కెమెరాలు, చీకటి ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తన ఫోన్ నంబర్‌ను పబ్లిక్‌కు ఇచ్చానని, గంజాయి తాగిన వారు, అమ్మిన వారి సమాచారం వాట్సప్/ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లా యాదవ సంఘం ఆత్మీయ సమావేశం

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల యాదవ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఎరినాలో నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణ యాదవ్ హాజరుకానున్నారన్నారు. ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లను సత్కరించనున్నామన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పిలి అప్పలకొండ, ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, నమ్మి వెంకట్, మొల్లి లక్ష్మణరావు, కార్యదర్శి డొక్కర శ్రీను, సారిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలితప్రియ పర్యవేక్షణలో ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. అండర్-11, 14, 17, 17 ఏళ్ల దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు.